


కథ

# నిఖిల గీతం

బెజ్జారపు వినోద్‌కుమార్

సాయంకాలమయ్యిందంటే చాలు, నేనా పాటకోసం ఎదురుచూస్తూ ఉంటాను. చంద్రుని రాకకోసం ఎదురుచూసే కలువ ప్రేయసిలా. ఊరికి దూరంగా ఉన్న నా క్వార్టర్‌లోంచి మరింత దూరం నడిచి వెళతాను. వేణుగోపాలస్వామి కోవెలను, రైలు పట్టాలను, మామిడితోపులనూ దాటి సోమన్నగుట్ట దిగువన ఉన్న విశాలమైన పచ్చిక మైదానాల మధ్యన ఓ ఎత్తైన బండరాయి మీద కూచుంటాను. ఆకాశ దేశపు పశ్చిమ వీధుల్లో అలికినట్లుగా ఉండే ఎరుపురంగు మాయమై మసక చీకటి చిన్నగా జల్లులు జల్లులుగా కురిసే సమయం నుండి ఆ పాట కోసం ఎదురుచూపులు మొదలవుతాయి. అంతవరకూ నాలోవున్న అశాంతిని, అలజడిని, బాధ్యతలను, గందరగోళాన్ని అన్నింటినీ పక్కన పెట్టేసి మనసునిండా శూన్యాన్ని నింపుకుంటాను. నేన ంతగా ఇష్టపడే నాలోని ఏకాంతాభిలాషను, స్వాప్నికావస్థను జాగృతం చేసే ఆ పాటంటే నాకు మరీమరీ ఇష్టం.

అలా ఎదురుచూస్తూ ఉంటానా? చీకటి చిక్కబడ్డాక ఏ చలిమంటల సెగల కొసల్లోంచో, వర్షపు చినుకుల చిత్తడిలో మెరిసే నక్షత్రాల వెలుగులోంచో ఎగిసి, వెన్నెల్లో కరిగి, చీకట్లో కలిసి, విశాలమైన ఆ పచ్చిక బయళ్ళమీద హేమ హరిణంలా పరుగులు తీస్తూ వచ్చి నన్ను చల్లగా చుట్టుకుంటుందా పాట. వేదనకి తాపానికి మధ్యస్థంగా ఉండే ఆ గొంతులోని తీవ్ర ఉద్విగ్నత మనసు మారుమూలల్ని సైతం స్పృశించి నన్ను ఓ స్వాప్నికావస్థలోకి జార్చుతుంది. ఆ స్థితి అలౌకికమైనది. వాంఛారహితమూ, ఉద్వేగ రహితమూ అయిన ఓ ప్రశాంత సమాధి స్థితి అది. ఆ పాటకు భాషలేదు, భావమూ లేదు. వయ్యారమైన కదలిక తప్ప.

నిజం చెబితే నమ్మరేమో... ఆ పాటలోని భావం ఏమిటో, ఆ భాష ఏమిటో, ఆ పాడే స్త్రీ ఎవరో తెలియకుండానే నేనాపాటకు బానిసనైపోయాను... నమ్మరుకదూ... ఆ పాటలోని మాధుర్యాన్ని వివరించడానికి నాకింతకు మించి పదాలు దొరకడంలేదు. ఈ విషయంలో నేను పూర్తి అశక్తుడను.

** ** **

ఉద్యోగరీత్యా నేను ఈ ఊరు వచ్చే చివరిసారి కూడా నాకు నచ్చజెప్పడానికి ప్రయత్నించారు ఇంట్లో. మాకున్న వ్యాపారాల్ని చూసుకోడానికి ఇద్దరన్నయ్యలే కాకుండా నా అవసరం కూడా ఉంది. అయినప్పటికీ వాళ్ళ మాటల్ని వినకుండా ఉద్యోగంలో చేరడానికే నిశ్చయించుకున్నానూ అంటే దానికి కారణం కేవలం నాలోని ఏకాంతాభిలాష. దానికి మూలాధారమైన నా స్మిత జ్ఞాపకాల వరద మాత్రమే.

మొదటిసారిగా నేనా ఊళ్ళో అడుగు పెట్టినప్పుడు నేను వెతికే ఒంటరితనం నాకు దొరికినట్లే అనిపించింది. ఆదిలాబాద్ జిల్లాలో మహారాష్ట్ర సరిహద్దుల్లో ఉన్న గ్రామమది. ఓ మాదిరి ఊరే అయినా ఇన్ని నాళ్ళ నగర జీవితం నుండి హఠాత్తుగా వచ్చినందుకేమో మరీ చిన్న ఊరిలా అనిపించింది. చిన్న ఊరే అయినా ఎంతో విశాలంగానూ అనిపించింది.

జాయినింగ్ రిపోర్ట్ ఇచ్చి, రూంలో సామానంతా సర్దే సరికి సాయంకాలమైంది. ఫ్యూన్ వీర్రాజుకి టిఫిన్ క్యారేజి తీసుకురమ్మని చెప్పి బయల్దేరాను.

మాఘమాసపు మధ్యరోజులు కావడంతో చలి ఇంకా తగ్గుముఖం పట్టలేదు. ఊరికి చివరగా బియ్యంలోంచి ఏరి పారేసిన రాళ్ళలా అక్కడక్కడ ఉన్న ఇళ్ళను దాటుకుని వేణుగోపాలస్వామి ఆలయ మంటపంలో ఓ మూల స్తంభానికి ఒరిగి కూచున్నాను. ఆలయం చాలా ఎత్తున ఉండటంతో దాదాపుగా సగం ఊరు కనిపిస్తోంది. పూజారి హారతి కర్పూరం వెలిగించి ఆలయం మూసేసి వెళ్ళిపోవడంతో ముసురుకునే చీకటితోపాటు నా ఒంటరి తనమూ చిక్కనైంది.

ఆ ఒంటరితనం చాలా అద్భుతంగా అనిపించింది. ఆకాశంలో వెన్నెల పచ్చిక మైదానాల మీదకు నిశ్శబ్దంగా జారిపడుతోంది. పెద్దగా పెరిగి టేకు వృక్షాలు, మోదుగు చెట్లు, వెన్నెల వెలుగులో ఎర్రెర్రగా మెరుస్తున్న మోదుగుపూలు, కీచురాళ్ళ రొద... ఆలయం మెట్లమీద పరుచుకున్న రాలిన చెట్టు ఆకుల నీడలు... దూరంగా ఏ ఇంటిముందరో ఎగిసిపడుతూ ఉన్న చలి మంటలు.

ఒక్కసారిగా నాకు స్మిత జ్ఞాపకమొచ్చింది.

'హర్ షామ్ ఆంఖో పర్ తేరా ఆంచల్
లహరాయే
హర్ రాత్ యాదోంకి బారాత్ లే ఆయె'

సృష్టిలోని కారుణ్యాన్ని, ప్రేమను అంతటిని తన ఒడిలో నింపుకుని నాకోసం నిరంతరం ఎదురు చూస్తూండే స్మిత...

ఫ్యూన్‌ను ఎనిమిదిన్నరకల్లా టిఫిన్ కారియర్ తీసుకురమ్మని చెప్పాను. ఆ విషయం గుర్తుకు రావడంతో ఇంక ఇంటికి వెళదామని లేవబోయేంతలో...

వినిపించిందా పాట...

చీకటి పొరల్లో ఓ వేకువ పురుడు పోసుకున్నట్లు, పుడమితల్లి గర్భంలో ఎక్కడో ఓ విత్తనం విచ్చుకున్నట్లు...

మంత్రం వేసినట్లుగా అలాగే కూచుండిపోయాను.

ముందుగా... ఓ చలమలో నీరు ఊరుతున్నట్లుగా నెమ్మదిగా ప్రారంభమై నన్ను స్పృశించిందా పాట. ఇంతలోనే చలమ నిండా నిండిపోయి, పక్కలకు జారి, ప్రవాహమై అంతలోనే ఉప్పెనయైనట్లుగా నన్ను చుట్టుకుందా పాట. ఆ గొంతులోని ఆర్తి ఆవేదన ఆమెలోని యుగాల తరబడి నిరీక్షణను, నిస్సహాయతను ప్రతిబింబిస్తోంది. ఆ పాట భాష తెలీదు, అందులోని భావమూ తెలీదు, పాడుతున్నదెవరో తెలీదు... కాని నాలోని స్మృతి విహంగాలను జాగృతపరిచిన ఆ పాటకు ఆ క్షణాన్నే బానిసనైపోయాను.


ఆ తరువాత ప్రతిరోజూ చీకటి పడగానే ఆరుబయట పచ్చిక మైదానాల్లో కూచుని ఆ పాటకోసం ఎదురుచూడ్డం, ఆ పాట తాకిడితో విస్తృతమైన నా స్వప్నలోకాలు తోడుగా ఇంటికి రావడం నా దినచర్యలో భాగమైపోయింది. ఆ పాట గురించి, అందులోని భావం గురించి, పాడే స్త్రీ గురించి తెలుసుకోవాలని ఎంతగానో అనిపించినా నా అంతశ్చేతనలోని ఓ అస్పష్ట భయం నన్ను తెలుసుకోనీయకుండా చేసింది.

చాలారోజుల తరువాత నా హాబీని గమనించిన వీర్రాజు ఓరోజు నేనడక్కుండానే చెప్పాడా పాట గురించి.

ఆమె అత్తగారిది ఈ ఊరు. తల్లిగారు గోదావరికి ఆవలివైపున మహారాష్ట్రలోని ఒక గ్రామంలో ఉంటారు. ఆమె నాలుగోనెల గర్భవతిగా ఉన్నప్పుడు ఆమె భర్త ఆర్మీకి వెళ్ళాడు. ఆ తరువాత కొద్దిరోజులకే పాకిస్తాన్‌తో జరిగిన ఓ సరిహద్దు పోరాటంలో అతను 'మిస్' అయ్యాడు. మిలటరీ పరిభాషలో 'మిస్' అయ్యాడూ అంటే మరణించినట్లే లెక్క. కాని ఆ విషయం ఆమె నమ్మదు. తన భర్త ఇంకా బతికే ఉన్నాడని తనకోసం తిరిగి వస్తాడని ఆమె నమ్మకం. అతనికోసం ప్రతి రాతిరీ అతన్ని ఆహ్వానిస్తూ పాడే స్వాగత గీతమే ఆ పాట. ఆ పాట పాడేది మరాఠీ భాషలో... ఆ పాటలోని భావం తెలుసుకున్నాక మరింత కదిలిపోయాను.

ఆ రాతిరి ఎప్పటికన్నా నూతనంగా వినిపించింది నాకా పాట...

'పిల్లగాలి రాగాలతో ఒడినింపి ఉంచాను
నిదురించడానికి తరలి రా ప్రియతమా!
నా గురించి నీవు కలత చెందకు సుమా
ఈ పుడమితల్లి ప్రసవించిన
తోబుట్టువులు
నిరంతరం నాకు అండగా ఉన్నారు......'



ఎంతటి కారుణ్యం ఆమె పాటలో...
ఎంతటి వేదన ఆమె గొంతులో...... ఈ సమాజంలోని మనుష్యుల మీద ఎంతటి నమ్మకం ఆమె మాటల్లో... ప్రియుడ్ని రమ్మని వేడుకుంటూనే, ఎక్కడ తన గురించి బెంగపడతాడోనని ధైర్యం చెబుతోంది.

పాట అయిపోయేసరికల్లా నా కళ్ళనిండా నీళ్ళు నిండాయి. 'ఆమె భర్త తిరిగి వస్తే బావుండు' మనసు మూలిగింది. ఆ పాట కొండల్ని కోనల్ని దాటేసి అతనికి చేరుతూనే ఉండి ఉంటుంది. ఆ గొంతులోని వేదనకున్న శక్తి అంతటిది మరి.

రాతిరైందంటే చాలు ఆ పాట మాత్రం తప్పక వినిపిస్తుంది. వాతావరణం ఎలావున్నా, ఏదేమైనా ఆ పాట మాత్రం వినిపించకుండా ఉండదు.

ఇదిలా ఉండగా అనుకోకుండా ఓసారి అకస్మాత్తుగా ఆమెను చూడ్డం తటస్థించింది. సైటుకని బయల్దేరి ఓచోట రోడ్డు ఇరుకుగా ఉండటంతో జీపు రోడ్డుమీదే ఆపేసి నడవసాగాను. ఇంతలోనే ఎదురుగా వస్తున్న ఒకామెను చూపిస్తూ అరిచాడు వీర్రాజు 'అదిగోండి సార్ రోజూ పాట పాడేది ఆమే....' అని.

క్యూరియస్‌గా చూసాను.

మాసిపోయిన చీర, పగిలిపోయిన కాళ్ళు, నిర్లక్ష్యంగా ముడేసుకున్న చింపిరి వెంట్రుకలు... ఆమె బాహ్యరూపం అలా ఉన్నా ఆమె అంతరంగంలోని ఉల్లాసం మాత్రం మొహంలో కనిపిస్తోంది. ఆమె చెక్కిళ్ళు నవ్వుతున్నాయి. ఆమె కళ్ళు ఆనందంతో వెలిగిపోతున్నాయి. ఇంకా ఆమెలోని యవ్వనం తరిగిపోలేదు. బహుశా తన భర్తకోసం అలా నిక్షిప్తపరిచి ఉంచిందేమో....?

ఇంతలోనే నాకామె పాట గుర్తుకొచ్చింది.

"నాగురించి నీవు కలత చెందకు సుమా
ఈ పుడమి తల్లి ప్రసవించిన తోబుట్టువు
లు
నిరంతరం నాకు అండగా ఉన్నారు..."

గుండెలో ఏదో తెలీని ఉద్వేగం. నా చెక్కిళ్ళు వణికాయి. ఆమెను ఆత్మీయంగా పలుకరించబోయాను. అంతలోనే ఆమె నన్ను దాటుకుని వెళ్ళిపోయింది.

మరో నెలరోజుల తరువాత ఇంటి నుండి ఉత్తరం వచ్చింది. వీలైనంత తొందరగా ఇంటికి రమ్మని. అత్యవసరమైతే తప్ప అలా ఉత్తరం వ్రాయరు. ఆరోజు రాత్రే ఇంటికి బయల్దేరి వెళ్ళాను. అమ్మను విడిచి అన్నిరోజులు బయట ఉండటం మొదటిసారి. అందుకే అమ్మ బెంగపడి పిలిపించిందట. రెండురోజులు అమ్మనీడలో హాయిగా గడిపేశాను. కాని మూడోరోజునే నా మనసు ఆ పాటమీద బెంగపడింది. ఆ రాత్రుళ్ళు, ఆ ఏకాంతం అన్నింటినీ మించి గుండెలోతుల్ని తాకి నా స్వప్నలోకాల్ని మరింత విస్తృతం చేసే ఆ పాట. ఎప్పుడెప్పుడు ఊరికి వెళ్ళి ఆ పాట ఒడిలో మేను వాలుద్దామా అన్న ఆతురత.

నాలుగోరోజు ఉదయం బయల్దేరడానికి నిశ్చయించుకున్నాను. కాని మూడోరోజు మధ్యాహ్నమే ఎన్నడు కనీవిని ఎరుగని, కనీసం ఊహించడానికి సైతం భయమేసే తీవ్రస్థాయిలో మొదలయ్యాయి మతకల్లోలాలు, ఎంతోమంది అమాయకుల రక్తంతో నగరం రోడ్లన్నీ ఎర్రబారాయి. ఆ రాతిరి నుండే నగరమంతటా కర్ఫ్యూ విధించారు. కర్ఫ్యూ కారణంగా బయటకు వెళ్ళడానికే వీలుకుదరలేదు. వారంరోజుల పాటు కర్ఫ్యూ సడలించలేదు. ఈ వారం రోజుల్లోనూ నాలో అసహనం మరింతగా పెరిగిపోయింది.

వారం రోజుల తరువాత ఊరికి బయల్దేరాను.

ఊరు దగ్గరవుతూన్నకొద్దీ నాలో ఉద్వేగం.... కోల్పోయిన అమూల్య సంపదను నేన్నే తిరిగి పొందబోతున్నానన్న ఆనందం.

ఊరు చేరుకునే సరికల్లా సాయంకాలమైంది. పరుగుపరుగున వెళ్ళి విశాలమైన పచ్చిక మైదానాల్లోని ఎత్తైన బండరాయి మీద కూచున్నాను. సమయం గడుస్తోంది... చీకటి చిక్కనైంది... ఆకాశ వీధుల్లో జాబిలి పరుగులు తీస్తున్నాడు.... వెన్నెల వాన ప్రకృతి నిండా నిండిపోయింది.

పాట వినిపించలేదు.

రాతిరి గడుస్తూనే ఉంది... పాట వినిపించలేదు.

తెల్లవారే వరకూ అలాగే కూచుని ఎదురుచూస్తూ ఉండిపోయాను... అయినా పాట వినిపించలేదు.

ఇన్ని సంవత్సరాల నుండి గ్రామాన్ని నిదురపుచ్చుతూండే ఆ పాట, ప్రళయం ముంచుకొచ్చినా ఈ ఊరిపైన విహరిస్తూండే ఆ పాట ఈరోజు ఎందుకు వినిపించడంలేదు.... మనసు పరిపరి విధాల పోయింది. తెలతెలవారుతూంటే ఊళ్ళోకి వచ్చాను.

వీర్రాజుని పిలిపించుకుని కారణం అడిగాను... అతను ఒక్కోమాటా చెబుతూంటే శరీరం కంపించసాగింది.

మొన్నటి మతకల్లోలాల తాకిడి ఈసారి రాష్ట్రానికంతటికీ పాకి, ఈ ఊళ్ళోను మత విద్వేషం ప్రారంభమైందట. అందులో భాగంగానే ఓరోజు రాతిరి తలుపులు తెరిచి ఉన్న ఆ ఇంటిలోకి ఒక ముష్కరుల గుంపు చొరబడి ఇంటిని లూటీ చేయడమే కాకుండా ఆమెను చెరిచారట.

చివరి మాటలు చెబుతూంటే నా గుండెలవిసిపోయాయి. నేను వడివడిగా ఆమె ఇంటికి పరుగు తీసాను.

ఇంటి ముందర గుమ్మానికొరిగి ఎటో శూన్యంలోకి చూస్తూ కూచుని ఉందామె.

'దీదీ...' చిన్నగా పిలిచాను.

తలతిప్పి చూసింది...

'పాట పాడవూ....' ప్రార్థిస్తున్నట్టుగా అడిగాను.

నా కళ్ళల్లోకి సూటిగా చూసిందామె. ఆమె చూపుల్లో ఒకే ఒక్క ప్రశ్న... ఆ ఒక్కటే ప్రశ్న అంతలోనే వందలై, వేలై, లక్షలై, కోట్లై నా గుండెల్లోకి దూసుకుపోసాగాయి.

కాని ఆ ప్రశ్నను ప్రక్కనపెట్టి ఒకే ప్రశ్న అడిగిందామె...

'ఎవరికోసం పాడాలి బాబూ.... ఆయన చచ్చిపోయాక....'

ఆరోజు రాతిరి విశాలమైన పచ్చిక మైదానాల్లోని అదే ఎత్తైన బండరాయి మీద కూచుని వెక్కివెక్కి ఏడ్చాను.

మళ్ళా ఎప్పటికీ నాకా పాట వినిపించలేదు.

**

